# కథ

## రాక్షస క్రీడ

**జి. అనసూయ**

సుధీరా వెనక్కి వెళ్లిపోదాం రావే... వాళ్ళుగాని చూశారంటె .. చంపేస్తారు. రా.... ఇవాల్టికి భోజనం చెయ్యకపోతే ఏం కాదులే. దూరంగా దార్లో నిలబడి ఉన్న సీనియర్ల గుంపును చూస్తూ భయంగా స్నేహితురాలిని లాగుతూ అంది రాగిణి.

సుధీర, రాగిణి ఇద్దరూ ఒకే ఊళ్ళో ఇంటర్ చదివారు. ఇద్దరూ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ పట్టుదలగా చదివి మెడిసిన్‌లో సీటు తెచ్చుకున్న వాళ్ళు. కాని మెడికల్ కాలేజీలో చేరిన సంతోషం నాలుగు రోజులైనా నిలువక ముందే ర్యాగింగ్ వాళ్ళను కలిచి వేసింది. సీనియర్స్... వాళ్లను వెంటాడి, వేటాడి అనేక రకాలుగా వేధిస్తున్నారు. ఎక్కడో సీనియర్ వస్తున్నారంటే లేచి నిలబడాలి. వాళ్ళడిగితే పర్సులో ఉన్న డబ్బులన్నీ ఇచ్చేయాలి. వాళ్ళ నోట్సులు రికార్డులు వ్రాసివ్వాలి, డైనింగ్ హాల్లో వాళ్ళ ఎదురుగా కూర్చోకూడదు. లైబ్రరీకి వెళ్ళకూడదు. సీనియర్స్‌ను సర్, మేడమనాలి. ఈ డ్రెస్సు వేసుకోకు. అంటే ఆ డ్రస్సు వేసుకోకూడదు. పాటపాడమన్నా డాన్సు చెయ్యమన్నా మాట్లాడకుండా చెయ్యాలి. గత రెండు వారాలుగా గుండెలు అరచేత పెట్టుకొని వాళ్ళు చెప్పినవన్నీ చేస్తున్నారు ఇప్పుడు సాయంత్రం ఎనిమిదవుతోంది. ఆకలి దంచేస్తుంది పొద్దున ఎప్పుడో ఒంటి గంటకు తిన్న అన్నం. అదీ సీనియర్స్ వస్తారన్న భయంతో ఆదరాబాదరాగా సాంబారుతో నాలుగుముద్దలు తిన్నారో లేదో... ఇప్పుడు వెళ్ళి కడుపునిండా తిందామంటే అక్కడ సీనియర్ల గుంపు. ఎనిమిది మంది అమ్మాయిలు ఓ అయిదారుగురు అబ్బాయిలు. భయపడి వెనిక్కి వెళితే ఈ రోజు ఉపవాసమే. సుధీర మనసంతా కుతకుతా ఉడికిపోతున్నది. ఇంకెన్నాళ్ళు... ఈ ర్యాగింగ్. ఏదో సీనియర్లు కదా అని ఊరుకుంటుంటే మితిమీరు తున్నాయి. వీళ్ళ ఆగడాలు. అసలు ర్యాగింగ్ నిషేధం కదా, ఒక్క కంప్లైంట్ ఇచ్చామంటే కాళ్ళ బేరానికి రారూ... ఏమైనా సరే ముందుకు వెళదాం రా... రాగిణి...వీళ్ళకు భయపడి కడుపు మాడ్చుకోనవసరం లేదు. పద ఏం చేస్తారో చూద్దాం" అంటూ ముందుకు నడిచింది సుధీర.

బిక్కుబిక్కుమంటూ సుధీర వెనకాలే బయల్దేరింది రాగిణి.

గుంపు దగ్గరకు రాగానే లేని ధైర్యం కూడ కట్టుకుంటూ

"హాయ్.. గుడ్ ఈవినింగ్; అంది సుధీర అందర్ని ఉద్దేశించి చెబుతున్నట్లుగా క్షణంలో సగం సేపు ఆగి తిరిగి నడుస్తూ.

పదడుగులు వేశారోలేదో.

'ఏయ్ ఆగు నిన్నే' వెనుకనుండి పిలిచారెవరో. ఆగి వెనక్కి చూసింది అప్రయత్నంగా రాగిణి చేయి పట్టుకుంది సుధీర. తడిసి ముద్దైఉంది రాగిణి అప్పటికే.

'హలో! ఎవరైనా పిలిచారా మమ్మల్ని ..." వెనక్కి రెండడుగులు వేసి అడిగింది.

'ఇలాంటి డ్రెస్సులతో కాంవన్‌లో తిరగ్గూడదని చెప్పలేదూ'. గదమాయింపుగా అంది ఓ అమ్మాయి.

'ఎంత ధైర్యమే, మీకు సీనియర్స్ అన్న గౌరవం లేకుండా మాముందునుండే వెళతారా' అంది మరో అమ్మాయి,

'సారి మాకు ఈ డ్రెస్సులే ఉన్నాయి వీటితోనే డైనింగ్ హాలుకు వెళుతున్నాం... అలాగే మీపట్ల మాకు చాలా గౌరవం ఉంది. కానీ దానితోపాటు ఆకలి కూడా ఉంది' అంది సుధీర.

'దీనికి తలనిండా పొగరు ఉన్నట్టుందే. దగ్గరకొస్తున్నారు గుంపుగా.

"నీవు వెళ్ళిపో' ఏం చూసుకొని దీని కింత పొగరో చూస్తాం" అంటూ రాగిణిని దూరంగా వెళ్ళిపొమ్మన్నారు. కన్నీళ్ళ పర్యంతమౌతూ తలొంచుకొని వెళ్ళింది రాగిని.

'నువ్వురా మా వెంట' అంటూ సుధీరను సీనియర్స్ హాస్టల్ వైపుతీసికెళ్ళారు. అక్కడ ఇంకో ఇరవై మంది దాకా చేరారు. అంతా చుట్టూ కూర్చుని మధ్యలో దోషిలా నిలబెట్టారు సుధీరను. డాన్స్ చెయ్యమన్నారు.

'నో...నాకు ఆకలేస్తుంది. ముందు నేనేమైనా తినాలి' అంది సుధీర.

పోనీ పాట పాడమన్నారు.

'నో నేను ఏమి చెయ్యలేను' అంది సుధీర.

'పోనీ సింపుల్ పని చెప్పనా.... నీడ్రెస్ విప్పేయ్...' అంది ఓ అమ్మాయి నవ్వుతూ.

'అవును... నీ పొగరుకు అదే కరెక్టు. కమాన్... డూ ఇట్' కోరస్ పాడారు మరికొందరు.

'నీ ఫోటో... రేపు గోడలమీద చూసుకుందువుగాని లే...' సెల్ కెమారా తీస్తూ అంది మరో అమ్మాయి.

'నో నేను డ్రెస్ విప్పను' మొండిగా అంది సుధీర

'ఏయ్... ఏమనుకుంటున్నావు నీవు మాకు ఎదురు తిరిగి ఈ కాలేజీలో చదువుదామనే' అంటూ విసురుగా చెయ్యెత్తింది ఓ ఆడ రౌడీలా ఉన్న అమ్మాయి.

'లేదు... నేను ఈ కాలేజీలో ఉండబోవడం లేదు' అంది సుధీర దృఢంగా

'ఏం చదువు మానేసి వెళ్ళిపోతావా...లేక ఇంకో కాలేజీలో చేరతావా... చూశావా మా తఢాఖా' అన్నట్టు చూసింది ఆడరౌడి.

'లేదు.... నేను... నేను సూసైడ్ చేసుకోబోతున్నాను' తన షర్టు జేబులోంచి ఓ చిన్న పొట్లం తీసింది సుధీర.

అంతా విభ్రాంతిగా చూస్తుండగా పొట్లంలోని తెల్లటి పొడరును చూయిస్తూ. ముందుకు రాబోతున్న సీనియర్స్‌ను... సీరియస్‌గా... స్టాప్ డోంట్ కమ్...టు...మి. అయామ్ గోయింగ్‌టు డై హియర్ ఇట్ సెల్ఫ్. నేను రూంలో సూసైడ్ నోటు వ్రాసిపెట్టి వచ్చాను. నా చావుకి సీనియర్స్ ర్యాగింగే కారణమని.... మీరుమెడికల్ స్టూడెంట్స్ అని చెప్పుకోడానికే సిగ్గేస్తోంది. మనమంతా అనేక కుటుంబ నేపథ్యాలనుండి అనేక సమస్యలనుండి ఎంతో కష్టపడి మెడికల్ కాలేజికి వచ్చాము, డాక్టర్లుగా బాధ్యత గల పౌరులుగా సమాజానికి మన సేవలనందించటానికి మనం వెళ్లాలి. మన ఆశలను, కలలను మన పెద్దవాళ్ళ ఆశయాలను నిజం చేసుకోవడానికి ఒకరికొకరం ఒకరికొరకు అందరు అందరికోసం ఒక్కరుగా వెలగాల్సిందిపోయి. రాక్షసక్రీడలాంటి ర్యాగింగ్‌తో జూనియర్స్‌ను భయభ్రాంతులను చేసి పారిపోయేటట్టు... చెయ్యడం దారుణం.

'ఈ రోజు నన్ను నగ్నంగా చూసి ఫోటోలు తీసి నన్ను అవమాన పరచడం వల్ల మీరు ఎలాంటి నేరం చేస్తున్నారో మీకు తెలియటంలేదు.

రేపు నా చావుకు కారణం మీరేనని తెలిసినప్పుడు మీ జీవితాలు మీమీద ఆశలు పెట్టుకున్న మీ వాళ్ళు ఏమవుతారో ఆలోచించుకోండి'

అంతా నివ్వెరపోయి చూస్తుండగానే తెల్లటి పొడిని నోట్లో వేసుకొని కాగితంతో సహా మింగేసింది సుధీర.

మరుక్షణం విరుచుకు పడిపోయింది. నోట్లోంచి నురగలు కక్కుతూ గిలగిలా కొట్టుకుంటున్న సుధీరను చూస్తూ

'అరె అలా చూస్తారేంటి.... వదండి హాస్పిటల్‌కు తీసుకు వెళదాం అంటూ, అంబులెన్స్‌కు ఫోన్ చెయ్యండి' అంటూ పరుగులు తీశారు.

క్షణంలో హాస్టల్ బాయ్స్, గర్ల్స్ అంతా వచ్చి చేరారు.

రాగిణి ఏడుస్తూ పరుగెత్తుకొచ్చింది క్షణాల్లో అంబులెన్స్ వచ్చింది. సుధీరను ఐసియులో ఉంచారు.

ప్రిన్సిపాల్ వచ్చారు నిమిషాల్లో... అసలేం జరిగిందంటూ... మేమే కారణం సార్... సుధీర్‌ను సరదాగా ర్యాగ్ చేశాం కాని ఇలా ప్రాణాలు తీసుకుంటుందనుకోలేదు. ఎలాగైనా సుధీరను కాపాడాలి సార్... అంటూ ఏడ్వ సాగారు సీనియర్స్.

తెల్లారితేగాని ఏ విషయం చెప్పలేం డాక్టర్ మాటలు వారి ఆందోళనను మరింత పెంచాయి.

మీడియావాళ్ళు వచ్చారు. పోలీసులు వచ్చారు.

అమ్మాయికి స్పృహ వచ్చాక గాని ఏ విషయం తెలియదు.

అని చెప్పారు ప్రిన్సిపాల్ ఇతర స్టాపు.

ర్యాగింగే కారణమటగా గ్రుచ్చి అడిగిన మీడియాకు సరైన సమాధానం దొరకలేదు. సీనియర్స్ నెవరిని ఏం మాట్లాడనివ్వలేదు ప్రిన్సిపాల్.



హైదరాబాద్ శ్రీ త్యాగరాయగాన సభలో మానస ఆర్ట్స్ థియేటర్స్, గానసభల ఆధ్వర్యంలో జరిగిన సభలో డా॥ జి. అంజనేయులు పరిశోధనాగ్రంథం "కులపురాణాలు-గౌడపురాణం"ను ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, దీక్షితులు, ఆచార్య టి. కిషన్‌రావు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య బిట్టు వెంకటేశ్వర్లు

ఆ అమ్మాయి తీసుకున్న పాయిజన్ ఏమిటో తెలియదు. అదేంటో తెలిస్తేగాని ఇది సూసైడ్ అటెంప్టా కాదా అని చెప్పలేం ఆ అమ్మాయి ప్రాణానికి హాని ఏమీ లేదు. అనవసర ఊహాగానాలకు తావివ్వ కండి అన్నాడు సుధీరకు ట్రీట్ చేస్తున్న డాక్టరు.

ఇది ర్యాగింగ్ కేసయితే మాత్రం సీనియర్లెవరూ తప్పించుకోలేరు. ఒక్కొక్కరికి ఏడు సంవత్సరాల రిగరస్ ఇంప్రజన్ మెంట్ కాలేజినుండి పర్మనెంటుగా సస్పెన్షన్... జాగ్రత్త వెళ్తూ వెళ్తూ హెచ్చరికలాంటిది చేసి వెళ్ళాడు పోలీస్ ఇన్‌స్పెక్టర్.

మర్నాడు మెడికల్ కాలేజి ఆవరణంతా గంభీరంగా ఉంది.

సుధీరకు ఏం కాకూడదు. సుధీర క్షేమంగా ఉండాలి. ఎక్కడ చూసినా ఇవే అక్షరాలు.

సుధీరకు స్పృహ వచ్చింది. తననెవరూ ర్యాగ్ చెయ్యలేదని సీనియర్స్ అంతా చాలా మంచి వాళ్ళని తమ కాలేజిలో ర్యాగింగ్ స్ట్రిక్ట్‌గా ప్రొహిబిట్ చెయ్యబడిందని.... తనకు ఒంట్లో బాగాలేక ఏదో మెడిసిన్ వేసుకుంటే రియాక్షన్ వచ్చిందని స్టేట్ మెంట్ ఇచ్చిందట. అన్ని అనుమానాలకూ తెర పడింది. సీనియర్స్ అంతా స్వచ్ఛందంగా ర్యాగింగ్ చెయ్యమని, చెయ్యనివ్వమని ప్రకటించారు.

సీనియర్స్ జూనియర్స్‌కు వెల్‌కం చెబుతూ ఫ్రెషర్స్ పార్టీ ఏర్పాటు చేశారు.

'ఎంత సాహసం చేశావు సుధీర..... ప్రాణాలే పోయుంటే' రాగిణి అదుర్దాగా అడిగింది ఆరోజు రూంకి వచ్చాక.

'నిజమే రాగిణి కాని ఆ సాహసం చెయ్యక పోతే ఈ ర్యాగింగ్‌కు అంతనేదే ఉండేదే కాదు కదే. మన లాంటి వాళ్లం చదువు మానుకుని వెళ్ళలేం కదా. సీనియర్స్ ఆ రాక్షసానందంలో పడి తాము ఏంచేస్తున్నారో తమకే తెలియనంతగా తెగించి ఉన్నారు. నిజంగా ఆ నగ్నంగా డాన్స్, ఆ కెమెరా ఫోటోలు గుర్తుకు తెచ్చుకుంటే అంతకంటే చావే నయం కదూ' అంది సుధీర. ఎంతయినా సుధీరవనిపించు కున్నావు... అంది రాగిణి. ఆనాటి దృశ్యాన్ని తలుచు కుని వణికి పోతూ,

ఇక నెక్స్ట్ ఇయర్ మనమే సీనియర్స్ కదా... మనమీ కాలేజీలో ఉన్నన్నాళ్ళూ ఆతరువాత కూడా ఇక ఈ కాలేజీలో ర్యాగింగ్ శాశ్వతంగా బంద్...